ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
సోమవారం | 20 ఏప్రిల్, 2026 | పేజీలు : 06

## మహిళ బిల్లుపై కాంగ్రెస్, బిఆర్ఎస్ వ్యవహారం శోచనీయం



వివరాలు మెయిన్‌లో...

## నేటి నుంచి ఓపెన్ పదో తరగతి, ఇంటర్ పరీక్షలు



**ప్రజాపక్షం / కాగజ్ నగర్:**సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఓపెన్ పదో తరగతి, ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ తెలిపారు. ఈ నెల 20వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. కాగజ్‌నగర్ మండలంలో మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మొత్తం 549 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. ప్రతిరోజు ఉదయం 9.00 గంటల నుంచి 12.00 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను సిద్ధం చేసినట్లు వెల్లడించారు.

**కేంద్రాల వారీగా వివరాలు..**

జెడ్‌పిఎస్‌ఎస్ బాయ్స్ కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్ ఆత్రం ప్రమీల, డిపార్ట్మెంట్ ఆఫీసర్ రవికుమార్ పర్యవేక్షణలో 203 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. జెడ్పిఎస్ఎస్ గర్ల్స్ కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్ పాక శ్రీలత, డిపార్ట్మెంట్ ఆఫీసర్ నీలయ్య ఆధ్వర్యంలో 211 మంది, గవర్నమెంట్ హై ఓల్డ్ కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్ నజీర్ అహ్మద్, డిపార్ట్మెంట్ ఆఫీసర్ తంగడిపల్లి రాకేష్ ఆధ్వర్యంలో 135 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :**తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీవారిని దర్శించుకోవటం సంతోషంగా ఉందన్నారు.

జిల్లావాసులంతా సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ వెంకటేశ్వరున్ని ప్రార్థించినట్లు తెలిపారు.

## ఆర్థిక ఇబ్బందులు ఉన్నా రైతు భరోసా విడుదల



పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో అడ్డగోలుగా చేసిన అప్పులతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఇబ్బందికరంగా ఉన్న రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 20వ తేదీన రై తు భరోసా నిధులు విడుదల చేస్తున్నారని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ అన్నారు. ఆదివా రం పెగడపల్లి మండలం ఐతుపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మ ణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రం లో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన కేవలం రెండు సంవత్సరాలకే మాజీ మంత్రి బీఆర్ఎస్ నేత కేటీఆర్ కళ్ళల్లో నిప్పులు పోసుకుంటున్నారని మంత్రి అన్నారు.

వివరాలు మెయిన్‌లో...

## ముందే వికసించింది..‘మే’ పుష్పం



## తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు



తెలంగాణ సాహిత్య రంగం అభివృద్ధకి నందిని సిథారెడ్డి ఎంతో కృషి చేశారని మాజీ మంత్రి ఎంఎల్ఏ హరీష్ రావు అన్నారు.నందిని సతారెడ్డికి కేంద్రం సాహిత్య అకాడమీ పురస్కారం అభించిన సంధర్భంగా శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని విపంచి కళా నిలయంలో నిర్వహించిన పౌర సన్మానంలో ఆయన ముఖ్య అథితిగా హాజరై పాల్గొని మాట్లాడారు.

వివరాలు మెయిన్‌లో...

## మైసమ్మ తల్లికి బోనాలు

ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వేముల కుర్తి గ్రామంలో ఆదివారం ఆటో, టాటా మ్యాజిక్ యూనియన్ సభ్యులు భక్తిశ్రద్ధలతో మైసమ్మ తల్లికి బోనాలు సమర్పించారు.వేములకుర్తి–యామాపూర్ గ్రామాల మార్గమధ్యంలోని మైసమ్మ సన్నిధికి బోనలతో ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ ప్రయాణాల్లో ఎలాంటి ఆటంకాలు లేకుండా,ప్రమాదాలు జరగకుండా కాపాడాలని అమ్మవారిని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తరి రామానుజం,ఉపసర్పంచ్ బర్మా మల్లయ్య, నాయకులు సున్నం సత్యం, యూనియన్ సభ్యులు చొప్పరి శ్రీధర్,దాసరి రంజిత్, దాసరి రాజు,కన్నె గంగారం, మురారి,బక్కి శ్రీను,తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు

ప్రజాపక్షం/ మల్లాపూర్ : చిన్ననాటి మిత్రుడు కీర్తిశేషులు నారి తుక్కారం జ్ఞాపకార్థం ఆయన జన్మదిన సందర్భంగా చిన్ననాటి మిత్రులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కాగా మన కేంద్రంలో భరతమాత కూడా వద్ద హెల్పింగ్ హ్యాండ్ స్వాడ్ ఆధ్వర్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గ్రామ సర్పంచ్ లక్ష్మణ్ పాలకవర్గ సభ్యులు ప్రారంభించారు. చిన్ననాటి మిత్రుడు జ్ఞాపకార్థం విశాల హృదయంతో ముందుకు వచ్చి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని హెల్పింగ్ హాండ్స్ సభ్యులను పాలకవర్గ సభ్యులు అభినందించారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఏనుగంటి నరేష్, మహమ్మద్ షబ్బీర్, సభ్యులు సంతోష్ రాజ్ కుమార్ నవీన్ శ్రావణ్, రాకేష్ మధు, హరీష్ బాబు,రఘు తదితరులున్నారు.

## మృతుడి కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం చేసిన ఎమ్మెల్యే



ప్రజాపక్షం/చొప్పదండి:చొప్పదండి మండలం కాట్నపల్లి గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన దళిత యువకు ఇటీవల వడదెబ్బ తగిలి మృతి చెందారు. ఈ క్రమంలో వారి కుటుంబ సభ్యులను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సహాయం చేశారు. భవిష్యత్తులో వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఇటీవల ఓఆర్ఆర్ పై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పెద్దిరెడ్డి దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులను ఓదార్చి వారి చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ గన్ను శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపిటిసిలు గాజంగి రాములు, కట్టెకోల లక్ష్మణ్, మార్కెట్ డైరెక్టర్ చుప్ప శ్రీనివాస్, కట్టెకోల శ్రీనివాస్, బండారి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# జాతర మహోత్సవానికి ముస్తాబైన ఆలయం



ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం :జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలోని అతి పురాతన ఆలయం అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం స్వామి వారి కళ్యాణ మహోత్సవాని కి ముస్తాబయింది. మహోత్సవంలో భాగంగా సోమవారం స్వామి వారికి అభిషేకం,విష్వక్సేనారాధన,పుణ్యావచన ము, రక్షాబంధనం, అంకురార్పణం, సాపిత మండపారాధన, ధ్వజారోహణం, గరుడ కళ్యాణం,తీర్థప్రసాదా వితర ణ కార్యక్రమాలు నిర్వహించనట్లు ఆలయ అర్చకుడు వెంకటేశ్వర చార్యులు తెలిపారు.అలాగే మంగళవారం స్థాపిత మండపారాధన, పంచ సూక్త హోమము, భేరీతాడన పూజ విధి, బలిహరణము, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు ని ర్వహించనున్నట్లు, బుధవారం స్థాపిత మండపారాధన, స్థా పిత హోమము, స్వామి వారి ఎదురుకోలు, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం, అన్నదానం, మహా పూర్ణాహుతి, ఆశీర్వచనం, సాయంత్రం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా రథయాత్ర, బలిహరణం ఉంజల్ సేవ , ఏకాంత సే వ నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వామి వారి కళ్యాణం అ నంతరం గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని, స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి ఆ భగవంతుని ఆశీస్సులు పొందాలని గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రాజేశుని భూమయ్య,ఉపాధ్యక్షుడు వెలిశాల శేఖర్,ప్రధాన కార్యదర్శి నేరెళ్ళ శ్రీనివాస్,రాజేశుని రాజారెడ్డి,సల్ల సునీల్ తదితరులు కోరారు.

## 25న హిందూ సమ్మేళనం

### మున్సిపల్ చైర్మన్ ములుగు ప్రశాంత్ కుమార్



ప్రజాపక్షం/జమ్మికుంట:రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (100) సంవత్సరాల శతాబ్ది ఉత్సవాల సందర్భంగా జమ్మికుంట పట్టణంలో హిందూ సమ్మేళనాన్ని ఈనెల 25 శనివారం సాయంత్రం జమ్మికుంట పట్టణంలోని శ్రీ విశ్వేశ్వర స్వామి (బొమ్మల గుడి) దేవస్థాన పరిధిలో నిర్వహిస్తున్నట్లు ఆదివారం నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు పోస్టర్ ను ఆవిష్కరించిన మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలో ధార్మికంగా ఎంతో ముందుందని ప్రజల్లో చైతన్యవంతం తేవాలంటే ఇలాంటి సమ్మేళనాల అవసరమని అప్పుడే సమాజం నీ మేలుకొలుపుని వాళ్ళం అవుతామని వారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ చందా రాజు, ఉత్సవ సమితి సభ్యులు పోకాల రవీందర్ రెడ్డి, రావికంటి నీలకంఠం, గందె రఘు, ఆకుల రాజయ్య, యముసాని సురేష్ , ఉమ్మడి చూరాచారి, కెవిదే కుమార్ స్వామి, భీమరి వెంకటేశ్వర్లు, బచ్చు భాస్కర్, జడల భాస్కరరావు, భూపతి రాజన్న, సోమారావు, తేల రాజమౌళి,డింగరి రవి కుమార్, ఆకుల రాజేందర్, యముసాని సమ్మయ్య, టంగుటూరు రాజకుమార్, పొన్నగంటి రవికుమార్,ఆవుల తిరుపతి, గట్టు సాయిరాం, సిరియాల విజయ్, మంచాల రాంబాబు, కంభంపాటి సతీష్, అయితే చంద్రమౌళి, ఆరెల్లి శ్రీనివాస్ ఉప్పుల శ్యామ్, దాసరి రవీందర్ మరియు మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కెసిఆర్ జగిత్యాల సభ రాకతో కాంగ్రెస్‌లో వణుకు

ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:టిఆర్ఎస్ అధినేత కెసిఆర్ జగిత్యాల సభకు రానుండడంతో కాంగ్రెస్ పార్టీలో వణుకు మొదలైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. కరీంనగర్‌లోని స్థానిక ఎమ్మెల్యే గంగుల క్యాంపు కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కెసిఆర్ బయటకు రాడు అని విమర్శలు చేసే కాంగ్రెస్ నాయకులకు కెసిఆర్ జగిత్యాల సభతో బయటికి వస్తున్నాడనగానే భయం పుట్టి రేపు, ఎల్లుండో రైతుబంధు వేస్తానని ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. కెసిఆర్ పరిపాలన దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గదన్నారు. ఆయన హయాంలో జిల్లాలకు మెడికల్ కాలేజీలు, కలెక్టరేట్‌లు, గురుకులాలు వంటివి అనేకం నిర్మించారన్నారు. కెసిఆర్ చరిత్రను ఎవరూ చెరుప లేరన్నారు. ఇచ్చిన హామీలే కాకుండా ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకువచ్చి తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు చేశారన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కూలగొట్టే విధానం తప్ప ఇప్పటికీ తెలంగాణ ప్రజలకు చేసింది శూన్యమన్నారు. కెసిఆర్ పథకాలపై రెట్టింపు ఇస్తానని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో అబద్ధపు హామీలను ఇచ్చి గద్దెనెక్కి కెసిఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలన్నింటిని బంద్ చేసిందని విమర్శించారు. కాళేశ్వరం లిఫ్ట్ ప్రాజెక్ట్, కొండపోచమ్మ సాగర్ వంటి ప్రాజెక్టులతో రైతులకు నీరు అందించారని చెప్పారు. సోమవారం జగిత్యాలలో జరిగే సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జివి రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్, మాజీ కార్పోరేటర్లు ఐలేందర్ యాదవ్, గందె మహేష్, మైనార్టీ నాయకులు మీర్ షౌకత్ అలీ, నారదాసు వసంతరావు, గూడెల్లి రాజ్ కుమార్ తదితరులున్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ప్రజాపక్షం/జమ్మికుంట:జమ్మికుంట పట్టణంలోని ల యోల పబ్లిక్ స్కూల్ 1999 2000 విద్యా సంవత్సరం ప దవ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం డీఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 26 ఏళ్ల అనంతరం అందరూ ఒకేచోట కలుసుకోవడంతో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. చిన్ననాటి స్నేహితులు ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకుని పాత జ్ఞాపకాలను తలచుకున్నారు. తరగతి గదిలో చేసిన అల్లర్లు, ఆటలు, గురువుల ప్రేమ, శిక్షలను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తమ జీవిత ప్రయాణాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో బోధించిన ఉపాధ్యాయులను ప్రత్యేకంగా ఆహ్వానించారు. వారికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. గురువులు కూడా విద్యార్థులను చూసి భావోద్వేగానికి లోనయ్యారు. విద్యార్థుల ఎదుగుదల తమకు గర్వకారణమని పేర్కొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ అనుమాస రాజేందర్ మాట్లాడుతూ, ఈ సమ్మేళనం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. తమ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఎదగడం గర్వకారణమని చెప్పారు. ఇలాంటి సమావేశాలు స్నేహబంధాలను మరింత బలపరుస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు, సరదా ఆటలు కూడా నిర్వహించారు. చివరగా పూర్వ విద్యార్థులు భవిష్యత్తులో కూడా ఇలాంటి సమావేశాలు కొనసాగించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనుబాబు, తిరుపతి, సదానందం, సుధాకర్, పూర్వ విద్యార్థులు కౌన్సిలర్ పొనగంటి రాము, చిదురాల రాకేష్, ముంజాల సాయికుమార్, శంకర్, గాజుల శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్లో ఖాళీ సీట్లకు ముగిసిన ప్రవేశ పరీక్షలు

ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం: జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 6, 7, 8, 9, 10 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ప్రవేశ పరీక్ష లను ఆదివారం నిర్వహించారు. సిబ్బంది విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం పరీక్ష హాల్లోకి అనుమతించారు. ప్రవేశ పరీక్ష నిర్వహణలో సిఎస్ గా ప్రభాకర్,డిఓ గా ప్రేమ్ కుమార్ విధులు నిర్వహించారు. పరీక్షను క్రమబద్ధంగా, ఎటువంటి అంతరాయం లేకుండా నిర్వహించడంతో అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఫలితాలను త్వరలోనే ప్రకటించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఇల్లెందు ప్రభాకర్ తెలిపారు.

## మున్నూరు కాపులను మాయం చేస్తరా?

ప్రజాపక్షం/గంగాధర:రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కులగణన నివేదికలో మున్నూరు కాపు జనాభాను 4 శాతం లోపు చూపించారంటూ చొప్పదండి నియోజకవర్గ మున్నూరు కాపు సంఘం కన్వీనర్ మడ్డపెల్లి శ్రీనివాస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ గణాంకాలు యావత్తు బిసి సమాజాన్ని తప్పుదోవ పట్టించి తమ హక్కులను కాలరాసే విధంగా ఉన్నాయని విమర్శించారు. కులగణన సర్వేలో అధిక సంఖ్యలో ఉన్న మున్నూరు కాపులను కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగవ స్థానంలో చూపించడాన్ని తీవ్రంగా ఖండించారు. గత ప్రభుత్వం చేసిన సర్వేలో మున్నూరు కాపులను మొదటి స్థానంలో చూపించారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాపులను కావాలనే తక్కువ జనాభా చూపిస్తుందని పేర్కొన్నారు. తమపై చిన్నచూపుతోనే ఈ ప్రభుత్వం మున్నూరు కాపులకు మంత్రివర్గంలో స్థానం కల్పించలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే మళ్లీ కులగణన సర్వే నిర్వహించి మంత్రి వర్గంలో మున్నూరు కాపులకు ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం నాయకులు మడ్డపెల్లి గంగాధర్, సామంతుల శ్రీనివాస్, గంట కిషన్, దొడ్డ ఎల్లారెడ్డి, గంట రమేష్, గంట హరీష్, రాంశెట్టి తిరుపతి, పులి చెర్ల లక్ష్మి నర్సయ్య, గంట లచ్చయ్య, దేశెట్టి మల్లారెడ్డి, దేశెట్టి రమేష్ తదితరులున్నారు.

## ముమ్మరంగా కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులు

ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు గ్రామ సర్పంచ్ పోతిపెద్ది కవిత కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ, గ్రామంలోని అన్ని వీధులలో ఉన్న డ్రైనేజీలు పూడిక తీపించి శుభ్రం చేపిస్తూ, ఎప్పటికప్పుడు తీసిన పూడికను గ్రామపంచాయతీ ట్రాక్టర్ ద్వారా సెగ్రిగేషన్ షెడ్డు కు తరలిస్తూ గ్రామంలోని పలువాడలలో ఉన్న చెత్తను సిబ్బంది ద్వారా తొలగిస్తూ పారిశుద్ధ్యం పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ చైతన్యవంతులను చేయడం జరిగింది. సీసీ డ్రైనేజ్ లేని చోట మురుగు నీరు వెళ్లేందుకు కచ్చా డ్రైనేజీలను జెసిబి సహాయంతో శుభ్రం చేయించడం జరిగింది. ఈ సందర్భంగా ఓడేడు సర్పంచ్ పోతుపెద్ది కవిత కిషన్ రెడ్డి పారిశుధ్యం పై ప్రత్యేక చొరవ తీసుకోవాలని గ్రామపంచాయతీ సిబ్బందిని ఆదేశిస్తూ, గ్రామ ప్రజలందరూ పారిశుద్ధ్య విషయంలో నిర్లక్ష్యం చేయకూడదని సూచించినారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ దాసరి ప్రశాంత్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి బూర్ల రాజేందర్,వార్డు సభ్యులు దాసరి దామోదర్,నరెడ్ల రమేష్ తో పాటు గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్‌టిసి కార్మిక సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరపాలి

ప్రజాపక్షం/ముత్తారం : స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంథనిలో రౌండ్ టేబుల్ సమావేశం ఆదివారం ఏర్పాటు చేసి మంథనిలోని అన్ని కార్మిక సంఘాలను ఆహ్వానించడం జరిగింది.ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన మహాలక్ష్మి స్కీంను ఆర్టీసీ కార్మికులు విజయవంతం చేస్తున్నారని, ఈ క్రమంలో వారు అనేక కష్టనష్టాలను ఎదుర్కొంటున్నారని అన్నారు. వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. సమ్మె కార్మికుల హక్కు అని,దానిని నిర్వీర్యం చేసే చర్యలు ప్రభుత్వం విడనాడాలని అన్నారు.విద్యుత్ బస్సుల పేరుతో కార్మికులను ఇతర రీజియన్లకు పంపే చర్యలను మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఆర్ల సందీప్,డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గొర్రెంకల సురేష్,కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మంథని లింగన్న,తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి వేల్పుల సురేష్, కార్మిక సంఘం నాయకులు సర్వర్,రవీందర్,తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేను కలిసిన విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

ప్రజాపక్షం/సారంగాపూర్: జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను వారి క్యాంప్ కార్యాలయంలో ఆదివారం రోజున సారంగాపూర్ మండలం లక్ష్మి దేవిపల్లి గ్రామ విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేకల శేఖర్, సంఘ అధ్యక్షులు పాంపర్తి మల్లేష్, కంచర్ల శ్రీనివాస్, సంకోజి సతీష్, కంచర్ల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి తీరంలో మున్సిపల్ కౌన్సిల్ శ్రమదానం

ప్రజాపక్షం/ధర్మపురి : జగిత్యాల జిల్లా ధర్మపురి పుణ్యక్షేత్రం లోని గోదావరి నది తీరంలో ఆదివారం మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి ఆధ్వర్యంలో కౌన్సిల్ సభ్యులు శ్రమదానం చేశారు.గోదావరి తీరంలోని సంతోషిమాత ఘాట్,మంగళి ఘాట్ ప్రాంతంలో ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు స్వచ్ఛతా కార్యక్రమం నిర్వహించగా స్థానికులు, భక్తులు కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. కార్యక్రమంలో భాగంగా నదీ తీరంలో భక్తులు వదిలివేసిన పూజా వస్తువులు, వస్త్రాలు,కొబ్బరిచిప్పలు, ప్లాస్టిక్ కవర్లను తొలగిస్తూ పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు.మున్సిపల్ చైర్ పర్సన్ నాగలక్ష్మి మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలను ఎలాగైతే పరిశుభ్రంగా ఉంచుకుంటామో గోదావరి నదీ మాత తీరాన్ని అదేవిధంగా వుండేలా చూసుకోవాలని కోరారు.గోదావరి పరిసరాల పరిశుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యతగా భావించాలని సూచించారు.

# నృసింహుడిని దర్శించుకున్న ఆర్‌టిఐ చీఫ్ కమిషనర్



ప్రజాపక్షం/ధర్మపురి : ప్రముఖ పుణ్యక్షేత్రం,జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి వారిని ఆదివారం స్టేట్ ఆర్టీఐ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు.స్వామివారి దర్శనార్థం ఆలయానికి చేరుకున్న కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి ని ఆలయ అధికారులు సాంప్రదాయం ప్రకారం పూర్ణకుంభంతో మేళతాళాలతో ఘనస్వాగతం పలికారు. తొలుత ప్రధానాలయం శ్రీ యోగనంద స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.దర్శనానంతరం వేదపండితులు, అర్చకులు కమిషనర్ కుటుంబసభ్యులకు ఆశీర్వచనం ఇచ్చారు.ఈ సందర్భంగా ఈఓ సంకటాల శ్రీనివాస్ స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం,చిత్రపటం కమిషనర్ దంపతులకు అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఈఓ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు సీహెచ్ .రమణయ్య,అర్చకులు సీ హెచ్ .అశ్విన్ కుమార్,సిబ్బంది పాల్గొన్నారు.

# సమానత్వం కోసం పోరాటం చేసిన యోధుడు అంబేద్కర్

ప్రజాపక్షం/గొల్లపల్లి : జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండల కేంద్రంలో సామాజిక సేవా కార్యకర్తలు గంగాధర మధుసూదన్, శాతల్ల లక్ష్మణ్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నామస్మరణం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు చిల్వాకోడూర్ గ్రామ సర్పంచ్ దాసరి తిరుపతి గౌడ్ పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా తిరుపతి గౌడ్ మాట్లాడుతూ బి ఆర్ అంబేద్కర్ దేశానికి అందించిన అమూల్యమైన సేవలు సమానత్వం ,సామాజిక న్యాయం సంస్కరణలలో వారి ఆశయాలను ఆలోచనలను ఆదర్శాల ద్వారా భవిష్యత్ తరాలు స్ఫూర్తి ,పొందాలనే లక్ష్యంతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు . భారతదేశం అనే దేశం గొప్ప సంస్కృతి వైవిధ్యాల సమాహారం కానీ అదే సమయంలో కుల వ్యవస్థ అనే సామాజిక వ్యాధి ఇంకా మన సమాజాన్ని వెంటాడుతూనే ఉంది.ఈ వ్యవస్థను నిర్మూలించడానికి బి.ఆర్. అంబేద్కర్ బాబు జగ్జీవన్ రామ్ వంటి మహనుభావులు తమ జీవితాలను అర్పించారు. వారు కేవలం మాటల్లో కాదు కార్యాచరణలోనూ సమానత్వం కోసం పోరాటం చేశారు.అంబేద్కర్ గారి ఆశయం స్పష్టంగా ఒకటే "మనిషిని కులంతో కాదు అతని ప్రతిభతో గుర్తించాలి." ఆయన భారత రాజ్యాంగాన్ని రూపొందించినప్పుడు సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం అనే విలువలకు ప్రాధాన్యత ఇచ్చారు.ఈ కార్యక్రమంలో శాలివాహన కుమ్మరి సంఘం మండల అధ్యక్షుడు సిరికొండ తిరుపతి, బాబు జగ్జీవన్ రావ్ సంఘం అధ్యక్షులు జేరిపోతుల కొమరయ్య, ఉపాధ్యక్షులు తుడుం నర్సయ్య, చిల్వాకోడూరు గ్రామ వార్డు సభ్యులు నాగయ్య, ఓరగంటి మల్లయ్య ,కాంపల్లి మానస శ్రీకాంత్, ఓరగంటి లచ్చయ్య, చెవులమద్ది సతీష్,సిపెల్లి శంకర్, జేరిపోతుల అంజయ్య, అంబేద్కర్ వాదులు,గ్రామస్తులు, పాల్గొన్నారు.

# మెట్టుపల్లిలో వైభవంగా హిందూ సమ్మేళనం



ప్రజాపక్షం/ మెట్టుపల్లి :జగిత్యాల జిల్లా:జగిత్యాల జిల్లా మెట్టుపల్లి పట్టణంలోని అభయ హస్త హనుమాన్ సమీపంలోని దుర్గామాత గ్రౌండ్‌లో నేతాజీ బస్తీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి హిందూ సమ్మేళనం కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు,మహిళలు, యువత పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేశారు.ఈ సమ్మేళనంలో పాల్గొన్న ఆధ్యాత్మిక స్వామీజీలు హిందూ సమాజ ఐక్యత అవసరాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. హిందువులంతా ఒకటిగా నిలబడి తమ సాంప్రదాయాలు, ఆచారాలు, సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రస్తుత కాలంలో సనాతన ధర్మ విలువలు తగ్గుతున్న నేపథ్యంలో ప్రతి కుటుంబం తమ పిల్లలకు చిన్ననాటి నుంచే ధర్మం, సంప్రదాయాలపై అవగాహన కల్పించాలని సూచించారు.ప్రధాన వక్తగా పాల్గొన్న విశ్వ హిందూ పరిషత్ కేంద్రీయ సహ కార్యదర్శి ఆకారపు కేశవ రాజు మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని బలహీనపరచేందుకు కొన్ని విదేశీ మతమార్పిడి శక్తులు ప్రయత్నిస్తున్నాయని, అలాంటి పరిస్థితుల్లో హిందూ సమాజం అప్రమత్తంగా ఉండి ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఐక్యతే శక్తి అని, పరస్పర సహకారంతోనే ధర్మ పరిరక్షణ సాధ్యమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా భక్తి గీతాలు, నృత్యాలు, సంగీత కార్యక్రమాలు, ధార్మిక ప్రసంగాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. హనుమాన్ నగర్ గ్రౌండ్ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమానికి మరింత శోభను చేకూర్చారు.కార్యక్రమం అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి హిందూ సమ్మేళన సమితి నిర్వాహకులు ప్రత్యేకంగా శ్రమించారు.ఈ హిందూ సమ్మేళనం మెట్టుపల్లి పట్టణంలో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపడంతో పాటు హిందువులలో ఐక్యత భావాన్ని మరింత బలపరిచిన కార్యక్రమంగా నిలిచింది.ఈ కార్యక్రమంలో నేతాజీ బస్తీ గౌరవ అధ్యక్షులు బొమ్మేళ శంకర్, గోపి, అధ్యక్షులు రఘుపతిరావు, ప్రధాన కార్యదర్శి లక్కం మల్లేష్ యాదవ్, ఉపాధ్యక్షులు పోలీస్ శ్రీనివాస్, 7వ వార్డ్ కౌన్సిలర్ ధర్మపురి స్వరూపవేణుగోపాల్, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు గుంటుక గంగాధర్, అల్లె మధు, వేములవాడ రాజశేఖర్,గాజంగి నాగరాజు, పాంపట్టి ఆనంద్,కలర్స్ గంగాధర్,పాల్గొన్నారు.

# డోర్నకల్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఎన్నికల కోఆర్డినేటర్‌నియామకం



ప్రజాపక్షం /మెట్‌పల్లి :ఏఐసిసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "సంఘటన్ శ్రీజన్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని డోర్నకల్ అసెంబ్లీ నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కోఆర్డినేటర్‌గా మెట్పల్లి పట్టణానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎండి. అవేజ్‌ను నియమించారు.ఈ మేరకు శనివారం పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాలు జారీ చేశారు.ఈ నియామకంతో నియోజకవర్గంలోని మండల కార్యవర్గాలు, గ్రామ శాఖలు, పట్టణ శాఖలు, వార్డ్ కమిటీలు,బూత్ స్థాయి కార్యవర్గాలు మరియు బూత్ లెవెల్ ఏజెంట్ల నియామక ప్రక్రియను పర్యవేక్షించే బాధ్యతలను ఎండి. అవేజ్‌కు అప్పగించారు.ఈ సందర్భంగా ఎండి. అవేజ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు కృషి చేస్తానని తెలిపారు. డోర్నకల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పర్యటిస్తూ, బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తానని పేర్కొన్నారు.తనను ఎన్నికల కోఆర్డినేటర్‌గా నియమించిన పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# అంజన్నను దర్శించుకున్న రాష్ట్ర ప్రధాన కమిషనర్



ప్రజాపక్షం/మల్యాల: జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు ఆంజనేయ స్వామిని తెలంగాణ రాష్ట్ర సమాచార ప్రధాన కమిషనర్ చంద్ర శేఖర్ రెడ్డి కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు.ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ స్థానాచారి కపీందర్ స్వామివారి శేషవస్త్రం కప్పి, లడ్డు ప్రసాదం అందజేశారు.ఈ కార్యక్రమం లో కమిషనర్ వెంట స్థానిక ఎస్ఐ నరేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ చెక్కిళ్ళ అశోక్,తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి అండగా నిలుస్తాం

## ప్రమాద స్థలాన్ని సందర్శించిన మంత్రి లక్ష్మణ్ కుమార్

ప్రజాపక్షం /పెగడపల్లి : మండలంలోని నందగిరి గ్రామంలో హార్వెస్టర్ బావిలో పడి డ్రైవర్ పాలకల్ల మధు మరణించిన ఘటనపై రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఆదివారం సాయంత్రం ఆయన ప్రమాద స్థలాన్ని స్వయంగా సందర్శించి,ఘటన జరిగిన తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, హార్వెస్టర్ డ్రైవర్ మధు మృతి చెందడం బాధాకరమని,ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. మృతదేహాన్ని బావిలో నుండి వెలికితీసే ప్రక్రియను వేగవంతం చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌ను ఫోన్ ద్వారా ఆదేశించారు. పోస్టుమార్టం నుంచి అంత్యక్రియల వరకు అధికారులే దగ్గరుండి పర్యవేక్షించాలని, బాధిత కుటుంబానికి కాంగ్రెస్ శ్రేణులు అండగా ఉండాలని సూచించారు. అనంతరం,ఎస్సీ కాలనీకి వెళ్లే దారిలో ప్రమాదకరంగా ఉన్న బావి వల్ల ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు మంత్రికి విన్నవించగా.. వెంటనే స్పందించిన ఆయన, రేపు (సోమవారం) అధికారులు గ్రామాన్ని సందర్శించి రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్,నందగిరి సర్పంచ్ ధనాల రజిత సురేష్,కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

# ఒటిపి ద్వారా ఆన్‌లైన్ ఎంట్రీకి అనుమతులు ఇవ్వాలి

ప్రజాపక్షం/ మల్లాపూర్ : మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించిన పట్టాదారులే వేలి ముద్ర ద్వారా ఎంట్రీ చేసుకోవాలంటే ఇబ్బందిగా మారిందని తక్షణమే దీనిని సవరించాలని భారతీయ కిసాన్ సంగ్ మండల అధ్యక్షుడు కల్లెం మహిపాల్ రెడ్డి అధికారులను కోరారు.ఈ సందర్భంగా మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, మార్క్ఫెడ్ డీఎం స్పందించి పట్టాదార్ రైతులు ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు, కొందరు పట్టాదారులు మృతి చెందడంతో వేలి ముద్ర సమస్య రైతులకు ఇబ్బందిగా మారిందని, గతంలో మాదిరిగానే ధాన్యాన్ని విక్రయించిన తర్వాత ఓటిపి ద్వారా ఆన్లైన్ ఎంట్రీ జరిగేలా చూడాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఉన్నత అధికార స్పందించి రైతులు ఎదుర్కొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

# ప్రశాంతంగా ముగిసిన మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

ప్రజాపక్షం/మల్యాల:జగిత్యాల జిల్లా మల్యాల మండలం నూక పెల్లి ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్)లో 202627 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతి,7 నుండి 10 వ తరగతి ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు ప్రిన్సిపల్ ఆదిత్య తెలిపారు.ఆయా తరగతుల ప్రవేశాలకు పలువురు విద్యార్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకొని ప్రవేశ పరీక్ష కు హాజరైనట్లు వివరించారు.ఆరో తరగతిలో 100 సీట్లు కు గాను 117 మంది అప్లై చేసుకొని 97 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆయన తెలిపారు.పరీక్షలో వచ్చిన మార్కులు,రిజర్వేషన్ నిబంధన మేరకు ప్రవేశాలను కల్పిస్తామన్నారు.

# ఘనంగా ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రారంభం



ప్రజాపక్షం /మెట్‌పల్లి :మెట్‌పల్లి పట్టణంలోని బరకత్పురాలో ఇదారా తలీమ్ ఉల్ ఖురాన్ ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీలకు సంబంధించి ఈ రోజు బహుమతి ప్రదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ పోటీలలో పాల్గొన్న 63 మంది బాలురు, బాలికలకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ప్రజాపక్షం రిపోర్టర్ అజీం కుమార్తె ఆయేషా హురైన్ రెండవ బహుమతి సాధించి ప్రతిభ చాటింది.అదేవిధంగా క్రియేటివ్ మైండ్స్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పేరుతో కొత్త ఇంగ్లీష్ మీడియం పాఠశాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 110 మంది విద్యార్థులను బహుమతులతో సత్కరించారు.ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ ముఫ్తీ అబూబకర్ సిద్దిక్ మాట్లాడుతూ తమ పాఠశాలలో నాణ్యమైన విద్య అందిస్తున్నామని,తల్లిదండ్రులు తమ పిల్లలను అడ్మిషన్లు చేయించాలని కోరారు.

## నేడు జగిత్యాలలో కెసిఆర్ సభ



**ప్రజాపక్షం / చందుర్తి :** జగిత్యాల జిల్లాలో సోమవారం జరిగే కెసిఆర్ సభకు మండలం నుండి భారీ ఎత్తున కార్యకర్తలు తరలి వెళ్ళి సభను విజయవంతం చేయాలని మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.కాంగ్రెస్ సీనియర్ నాయకులు జీవన్ రెడ్డి చేరికతో ఉత్తర తెలంగాణాలో బీఆర్ఎస్ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో మాజీ ఎంపీపిలు చిలుక పెంటయ్య, తిప్పని శ్రీనివాస్ , మాజీ ఏఎంసి చైర్మన్ ఏనుగుల శ్రీనివాస్ ,నాయకులు బైరగోని రమేష్ , దుమ్మ ఆనంద్ , దీకొండ తిరుపతి రావు, లింగంపల్లి రాములు , మర్రి రాములు,పోతరాజు రెడ్డి పాల్గొన్నారు.

## కుక్క కరిచిన చిన్నారికి సర్జరీ



**ప్రజాపక్షం/పెద్దపల్లి:**అందుగులపల్లి గ్రామానికి చెందిన సంవత్సరం వయసు గల చిన్న బాబు ను శనివారం రోజున పిచ్చి కుక్క కరచి తీవ్రంగా గాయపరచగా వెంటనే బాబును తండ్రి దండ్రులు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు రాగా స్పందించిన పిల్లల డాక్టర్లు ఆ బాబును అడ్మిట్ చేసుకొని చికిత్స ప్రారంభించారనీ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ కే శ్రీధర్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ARV injection తో సహా ఖరీదైన ఇమ్మునోగ్లోబులిన్ ఇంజెక్షన్ ఇవ్వడం జరిగిందనీ, వైద్యులు అన్ని రకాల పరీక్షలు చేపించి ఆదివారం రోజున బాబుకు తగిన జాగ్రత్తలు తీసుకొని కుక్క కరిచిన తీవ్ర గాయాల కు తగిన శస్త్ర చికిత్స చేసి ఆ బాలుడి కి పూర్తి ఉపశమనం కల్పించామని ఈ శస్త్ర చికిత్సలో పాల్గొన్న డాక్టర్ కుమారస్వామి, జనరల్ సర్జన్ మరియు డాక్టర్ రామం,అనస్థీషియా వైద్య బృందాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కాగా వెంటనే స్పందించి బాబుకి తగిన ఆపరేషన్ చేసి ప్రాణాపాయం నుండి తప్పించిన ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ కే శ్రీధర్ nu మరియు వైద్యులను బాబు తల్లిదండ్రులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.అదేవిధంగా ప్రజలందరూ పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న నవజాత శిశు కేంద్రం సేవలు, 2 డి ఎకో సేవలు, ఆధునిక పరిజ్ఞానంతో కూడిన లాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్సలు,యూరాలజీ సేవలు మరియు రూట్ కెనాల్ సేవలను ఉపయోగించుకోవాలని, మరియు ఈ సేవలలో ఏవైనా ఇబ్బందులు ఎదురైనచో నేరుగా సూపరింటెండెంట్ గారిని కలవచ్చు అని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు.

# రాహుల్ గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం



**ప్రజా పక్షం /ఎల్లారెడ్డిపేట:** మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మి రెడ్డి ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఎస్కే సబేరా బేగం ఆదివారం రాహుల్ గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు ఈ సందర్భంగా మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ పార్లమెంటులో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మహిళా బిల్లును అడ్డుకున్నారని ఆయన దిష్టిబొమ్మను శనివారం మండల కేంద్రంలో బిజెపి కార్యకర్తలు దగ్ధం చేయడం జరిగిందన్నారు దీనికి నిరసనగా రాహుల్ గాంధీ మంచితనాన్ని తెలుపుతూ ఆయన చిత్రపటానికి కార్యకర్తలు అందరూ నాయకులు పాలాభిషేకం చేయడం జరిగిందన్నారు చట్టసభలలో 33% రిజర్వేషన్లు కల్పించే బిల్లును కాంగ్రెస్ పార్టీ గతంలో పార్లమెంటులో ఆమోదించడం జరిగిందన్నారు అదే బిల్లును చట్టం చేయక తిరిగి భారతీయ జనతా పార్టీ మహిళా బిల్లుతో పాటు నియోజకవర్గాల పునర్విభజన బిల్లును కూడా పార్లమెంటులో 131 ఆర్టికల్ ద్వారా తేవడం జరిగిందన్నారు సీట్ల పెంపు విషయంలో ఉత్తర భారతదేశానికి లాభం జరగగా దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత నెల రోజుల నుండి చెప్పడం జరిగిందన్నారు ఒకే ఒక్క మహిళా బిల్లును పార్లమెంటులోకి తేకుండా డీలిమిటేషన్ బిల్లును కూడా తోడుగా తీసుకువచ్చి దొడ్డి దారిన బిజెపి తన కుటిల తత్వాన్ని నిరూపించుకుందన్నారు. ఇటువంటి బిల్లుకు పార్లమెంటులో విపక్ష పార్టీలన్నీ ఏకమై కేంద్ర ప్రభుత్వాన్ని పార్లమెంటులో ఓడించడం జరిగిందన్నారు మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు కట్టుబడి ఉందని అన్నారు .ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు కల్లూరి బాపు రెడ్డి. చిరం నాగరాజు. మామిండ్ల కిషన్. నెత్తెట్ల లక్ష్మయ్య నాయకులు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు దత్తాద్రి గౌడ్. జిల్లా ప్రధాన కార్యదర్శి వంగ గిరిధర్ రెడ్డి. జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్ కే సాహెబ్. షేక్ గౌస్ చెన్ని బాబు. గంట బుచ్చ గౌడ్ మండే శ్రీనివాస్ వంగ మల్లారెడ్డి రొద్ద రామచంద్రం నంది కిషన్ బండారి బాల్ రెడ్డి జజ్జరి దేవేందర్ మూడవత్ తిరుపతి భూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

# ఏప్రిల్ 20 లోగా దరఖాస్తులు, మేనేజ్‌మెంట్ లేఖలు సమర్పించిన వారి పేర్లు తొలి జాబితాలో పరిశీలన

### ఒరిజినల్ మేనేజ్మెంట్ లేఖలకే ప్రాధాన్యం
### జిరాక్స్ పత్రాలు పరిగణనలోకి రావు
### డిపిఆర్ఒ జగన్

**ప్రజాపక్షం/పెద్దపల్లి :**ఏప్రిల్ 20 లోగా ఆన్ లైన్ లో దరఖాస్తులు సమర్పించి,దరఖాస్తులతో పాటు సంబంధిత ఒరిజినల్ మేనేజ్మెంట్ లేఖలను డిపిఆర్ఓ కార్యాలయంలో అందజేసిన మీడియా ప్రతినిధుల పేర్లు మొదటి జాబితా కొరకు పరిశీలన చేసి కమిటీ ఆమోదం మేరకు అక్రెడిటేషన్ లు మంజూరు చేయనున్నట్లు జిల్లా పౌర సంబంధాల అధికారి బి. జగన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు .ప్రస్తుతం ఉన్న అక్రెడిటేషన్ కాలపరిమితి ఏప్రిల్ 30తో ముగియనున్నందున నూతన అక్రెడిటేషన్ లు జారీ చేయవలసి ఉన్నదని, మీడియా ప్రతినిధుల అక్రెడిటేషన్ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని, ఏప్రిల్ 20 లోగా వచ్చిన పేర్లను మొదటి జాబితాలో, తదుపరి వచ్చే దరఖాస్తులు, మేనేజ్మెంట్ లేఖలను రెండవ విడతలో పరిశీలించ నున్నట్లు తెలిపారు. జిరాక్స్ లేదా కలర్ జిరాక్స్ మేనేజ్మెంట్ లేఖలను పరిగణలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు.అర్హత గల మీడియా ప్రతినిధులు సూచించిన మార్గదర్శకాలను అనుసరించి దరఖాస్తులు సమర్పించాలని డీపీఆర్ఓ జగన్ ప్రకటనలో కోరారు.

# ఆదర్శంగా నిలిచిన గాయకుడు గోస్కుల రమేష్

### 25వ పెళ్లి రోజున అన్నదానం



**ప్రజాపక్షం/ముత్తారం :**పెద్దపల్లి ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందినప్రముఖ జానపద గాయకుడు గోస్కుల రమేష్‌స్వప్న తన 25వ వివాహ వార్షికోత్సవాన్ని (సిల్వర్ జూబ్లీ) అత్యంత ఆదర్శవంతంగా జరుపుకున్నారు. విలాసాలకు పోకుండా,ఆడంబరాలకు దూరంగా ఉంటూ,తన పెళ్లి రోజు వేడుకను పేద ప్రజల ఆకలి తీర్చడం ద్వారా అర్థవంతంగా మార్చుకున్నారు.అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..పెద్దపల్లి పట్టణంలోని అమ్మ ఫౌండేషన్ వేదికగా ఈ అన్నదాన కార్యక్రమం జరిగింది. గోస్కుల రమేష్ స్వప్న దంపతుల 25 ఏళ్ల వైవాహిక బంధం పూర్తయిన సందర్భంగా, ఫౌండేషన్ సభ్యుల సహకారంతో పలువురు అభాగ్యులకు,పేదలకు స్వయంగా భోజనం వడ్డించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ప్రముఖులు స్థానికులు గోస్కుల రమేష్ స్వప్న దంపతులను అభినందించారు. కళాకారులు సమాజం పట్ల బాధ్యతగా ఉంటూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం ఇతరులకు స్ఫూర్తిదాయకమని వార్షు కొనియాడారు.గాయకుడు గోస్కుల రమేష్ మాట్లాడుతూ ఈ రోజును గుర్తుండిపోయేలా జరుపుకోవాలని, అమ్మ ఫౌండేషన్ ద్వారా ఈ అన్నదాన కార్యక్రమం చేపట్టాం. తోటి వారికి సహాయం చేయడంలో ఉన్న తృప్తి మరెందులోనూ లేదు అని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ నిర్వాహకులు, స్థానిక కళాకారులు, అభిమానులు పాల్గొని దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఆర్‌టిసికార్మిక సంఘాలతో ప్రభుత్వం చర్చలు



**ప్రజాపక్షం/మంథని :** ఆర్‌టిసికార్మిక సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరపాలని సిఐటియు నాయకులు పేర్కొన్నారు.ఆదివారం స్టాప్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో రౌండ్ టేండ్ సమావేశం ఏర్పాటు చేశారు.నాయకులు గణేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన మహాలక్ష్మి పథకాన్ని ఆర్‌టిసి కార్మికులు విజయవంతం చేస్తున్నారని, వెంటనే ప్రభుత్వం స్పందించి వారి డిమాండ్స్ ను పరిష్కరించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడుఆర్ల సందీప్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గొర్రెంకల సురేష్, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మంథని లింగన్న, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి వేల్పుల సురేష్, కార్మిక సంఘం నాయకులు సర్వర్,రవీందర్,తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సత్తెమ్మకు కెటిఆర్ నివాళి

**ప్రజాపక్షం/ వేములవాడ:** వేములవాడ నియోజకవర్గం అగ్రహారానికి చెందిన ప్రముఖ ఉద్యమకారురాలు తెలంగాణ సత్తెమ్మ మృతి పట్ల బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తు. ఆమె పార్థివ దేహానికి నివాళులర్పించడమే కాకుండా, స్వయంగా పాడె మోసిన కేటీఆర్. తెలంగాణ మలిదశ ఉద్యమంలో సత్తెమ్మ చురుకైన పాత్ర పోషించారు. ఉద్యమ సమయంలో ప్రతి రోజూ పాల్గొంటూ, జై తెలంగాణ నినాదమే ఊపిరిగా జీవించిన ధీర వనిత ఆమె. స్వరాష్ట్ర సాధన కోసం సత్తెమ్మ చేసిన పోరాటం, ఆమె అంకితభావం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా కేటీఆర్ కొనియాడారు.ఈ కార్యక్రమంలో కేటీఆర్‌తో పాటు వేములవాడ నియోజకవర్గం ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీ నరసింహ రావు ,మాజీ జెడ్పీ చైర్మన్ తుల ఉమ ,రాష్ట్ర నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, ఇతర పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొని సత్తెమ్మకు కన్నీటి వీడ్కోలు పలికారు.

## కోనరావుపేట మండలం మల్కపేటలో వివాహిత అదృశ్యం

**ప్రజాపక్షం/ కోనరావుపేట/వేములవాడ:** కోనరావుపేట మండలంలోని మల్కపేట గ్రామానికి చెందిన కుతాడి అనిత (19) సంవత్సరాల వివాహిత అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఈ రోజు తెల్లవారు జామున సుమారు రెండు గంటల సమయంలో అనిత ఇంట్లో నుండి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయిందని, భార్య కనిపించకపోవడంతో ఆందోళన చెందిన భర్త బాలకిషన్ బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికినప్పటికీ ఫలితం లేకపోవడంతో కోనరావుపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి దరఖాస్తు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఎరుకల కులానికి చెందిన ఈమె ఆచూకీ తెలిసిన వారు వెంటనే కోనరావుపేట పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు కోరారు.

## అలారం లాక్ దొంగతనాలకు చెక్



**ప్రజాపక్షం /ముస్తాబాద్:** ముస్తాబాద్ మండలం బదనకల్ గ్రామంలోని దేవాలయాలకు గ్రామ సర్పంచ్ చిగురు నరేష్ సహకారంతో అల్లారం లాక్ ఏర్పాటు చేశారు. గ్రామంలో అలారం లాక్ ఏర్పాటు చేసి, స్థానిక ఎస్సై గణేష్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లారం లాక్ లతో దొంగతనలు జరగకుండా ఉంటాయి ఇదేవిధంగా అన్ని గ్రామాల ప్రజలు జాగ్రత్తల గురించి ఆలోచించి, ఎలాంటి దొంగతనాలకు జరగకుండా అల్లారం లాకులు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ నరేష్ , ఎస్సై గణేష్, ఆలయ అర్చకులు, గ్రామపంచాయతీ పాలకవర్గం,బదనకల్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కాకతీయ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ విభాగం నుండి నరహరి అజ్మీరకు పీహెచ్.డి

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయం,కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ నుండి నరహరి అజ్మీర పీహెచ్.డి పట్టా పొందారు. డా. పి. కామాక్షి మార్గదర్శకత్వంలో ఆయన పరిశోధన పూర్తి చేశారు.డీప్ లెర్నింగ్ విధానాలను ఉపయోగించి ప్రొడక్ట్ రివ్యూల ఆధారంగా భావ విశ్లేషణ అనే అంశంపై ఆయన పరిశోధన నిర్వహించారు. ఈ పరిశోధన కృత్రిమ మేధస్సు , సహజ భాషా ప్రక్రియ రంగాలకు సంబంధించింది.నర్సంపేట మండలం, కమ్మపల్లి గ్రామంలోని చెక్రం తండాకు చెందిన నరహరి అజ్మీర, సాధారణ రైతు కుటుంబానికి చెందినవారు. ఆయన తల్లిదండ్రులు అజ్మీర నర్సయ్య, చిలకమ్మ. ప్రస్తుతం జేఎన్టీయూహెచ్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, మంథని లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.ఈ సందర్భంగా తన గైడ్ డా. పి. కామాక్షి కి, విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్, డీన్, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్, ప్రిన్సిపల్, హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.అలాగే తన తల్లిదండ్రులు అజ్మీరా నర్సయ్య, చిలకమ్మ మరియు భార్య కల్పనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా సహచరులు, మిత్రులు ఆయనను అభినందించారు.

## బంగారు దుకాణంలో చోరీ

ప్రజాపక్షం/తానూర్ : మండల కేంద్రంలో ఇండియన్ నంబర్ వన్ ఎటిఎం సమీపంలో ఉన్న సాయి ప్రసాద్,బంగారు దుకాణంలో చోరీకు పాల్పడి 300 గ్రాములు వెండి గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు బంగారు దుకాణం యజమాని పేర్కొన్నారు.శనివారం రాత్రి 10 గంటలకు దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లిన బంగారు దుకాణ యజమాని ఆదివారం ఉదయం తెరిచేందుకు వచ్చిన అయన దుకాణం యొక్క షట్టర్ ను ఇనప రాడ్లతో వంచి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు దీంతో అక్కడికి చేరుకున్నఎస్ఐ షేక్ జుబేర్,దుకాణంలో లోపలికి ప్రవేశించి పరిశీలించారు.300 గ్రాముల వెండి అభరణాలు అపహరించినట్లు దుకాణ యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## పాఠశాల ప్రహరీ గోడా పనులకు శంకుస్థాపన



ప్రజాపక్షం/తానూర్ : మండలంలోని కోలూర్ తండాలో ఆదివారం పాఠశాల ప్రహరీ గోడా నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 14.10 లక్షల నిధులతో ప్రాథమిక పాఠశాల ప్రహరి గోడ నిర్మాణ పనులను సర్పంచ్ పవార్ నిర్మలా బాయిగణేష్ భూమి పూజ చేసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వాతీ,తండా నాయక్,కారోబారి,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గ్రాడ్యుయేషన్ డే చిన్నారి విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ

ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : పట్టణంలోని నటరాజ్ నగర్‌లో గల బచ్‌పన్ ప్లే స్కూల్‌లో విద్యార్థుల గ్రాడ్యూయేషన్ డే వేడుకలు ఆదివారం అత్యంత కోలాహలంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సైన్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వినోద్ కుమార్ హాజరుకాగా గౌరవ అతిథిలుగా నిర్మల్ జిల్లా టీఆర్ఎస్ ఎంఎ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాస్,ఈసీ మెంబర్ షబ్బీర్ అలీలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రీప్రైమరీ విద్యను విజయవంతంగా పూర్తి చేసుకున్న చిన్నారి విద్యార్థులకు స్కూల్ యాజమాన్యం గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందజేసి ఘనంగా సత్కరించింది.ముఖ్య అతిథులు మాట్లాడుతూ పిల్లల బంగారు భవిష్యత్తుకు పునాది ప్రాథమిక విద్యేనని,వారిలోని సృజనాత్మకతను వెలికితీయడంలో ప్లే స్కూల్స్ కీలక పాత్ర పోషిస్తాయని కొనియాడారు.విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖారాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.ఈ వేడుకలో స్కూల్ కరస్పాండెంట్ అయ్యన్నగారి శ్రీధర్,ప్రిన్సిపాల్ రచన,ఉపాధ్యాయ బృందం,పెద్ద సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని పిల్లల ప్రదర్శనలను తిలకించారు.

## కొమురవెల్లి మున్నూరు కాపు సంఘం కార్యవర్గ ఏకగ్రీవ ఎన్నిక



ప్రజాపక్షం / రెబ్బన : రెబ్బన మండలం కొమురవెల్లి గ్రామ మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు గ్రామ, యూత్ కమిటీలను ఎన్నుకున్నట్లు జిల్లా మున్నూరు కాపు సంఘం అడక్ కమిటీ సభ్యులు జగడం సత్యనారాయణ, చెన్న సోమశేఖర్, గజ్జల సత్యనారాయణ తెలిపారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కోట కమలాకర్, గౌరవ అధ్యక్షుడిగా ఓడ్నాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఓడ్నాల నరేష్, తన్నీరు దామోదర్, ప్రధాన కార్యదర్శిగా ఓడ్నాల రమేష్ ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా పెద్దింటి గోపాల్, ఎరుబోతుల శంకరయ్య, ఓడ్నాల శ్రీనివాస్, ప్రచార కార్యదర్శులుగా గజ్జల రమేష్, పెద్దింటి శ్రీనివాస్, కోశాధికారిగా గజ్జల సత్తన్న బాధ్యతలు చేపట్టారు. గ్రామ యూత్ కమిటీ అధ్యక్షుడిగా ఓడ్నాల సందీప్, ఉపాధ్యక్షులుగా దారిశెట్టి వికాస్, మణికొండ సాయికిరణ్, ప్రధాన కార్యదర్శిగా గజ్జల మల్లేష్ ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా పెద్దింటి నరేష్, ఎరువోతుల రాజేష్, ఓడ్నాల కృపాల్, మైదం ప్రదీప్, కోశాధికారిగా పెద్దింటి సాయి, ప్రచార కార్యదర్శిగా పెద్దింటి మల్లికార్జున్ నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం మండల కార్యదర్శి ఇంగు మల్లేష్, మండల యూత్ అధ్యక్షుడు ఇంగు సాయికుమార్, సభ్యులు ఓడ్నాల దుర్గాప్రసాద్, శశికిరణ్, అల్లాడి రాజేష్ పాల్గొన్నారు.

## కుర్చీ కాపాడుకోవడానికే కాంగ్రెస్ కుట్రలు

### మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్



ప్రజాపక్షం / చెన్నూరు : కుర్చీని కాపాడుకునేందుకే కాంగ్రెస్ కుట్రలు పన్నుతూ అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేస్తోందని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపించారు. ఆదివారం చెన్నూరు మాజీ కౌన్సిలర్ తుమ్మ రమేష్ తన అనుచర వర్గంతో కలిసి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బాల్క సుమన్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెండేళ్ల పాలనలో రేవంత్ సర్కార్ విఫలమై చేతులెత్తేసిందని, రాష్ట్ర ప్రజానీకం మరోసారి కెసిఆర్ పాలననే కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా, అక్రమ కేసులు పెట్టినా ప్రజా సంక్షేమం కోసం తాము పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. చెన్నూరు నియోజకవర్గంలో మంత్రి ఆగడాలకు హద్దు లేకుండా పోతోందని, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. యువతకు 40 వేల ఉద్యోగాలు ఇస్తానని నమ్మించి మోసం చేసిన ఘనత మంత్రి వివేక్ దని విమర్శించారు. తన హయాంలో మంజూరైన మున్సిపాలిటీ అభివృద్ధి పనుల నిధులను ఇప్పుడు వాడుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మంత్రి నిర్లక్ష్యం వల్లే 500 కోట్లతో ఏర్పాటు కావాల్సిన ఆయిల్ ఫామ్ మిల్లు మరో ప్రాంతానికి తరలిపోయిందని ఆరోపించారు. ఇప్పటికైనా మంత్రి తీరు మార్చుకుని ఎన్నికల హామీలను నెరవేర్చాలని, లేనిపక్షంలో రెండు వేల మందితో కలిసి చెన్నూరులో భారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## మానవత్వంతో కూడిన వైద్యమే లక్ష్యం..

### హాజరైన వివిధ జిల్లాల వైద్యులు..



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా మానవత్వంతో కూడిన వైద్యాన్ని అందించడమే ప్రధాన ఉద్దేశం అని అసోసియేషన్ ఫిజీషియన్ ఆఫ్ ఇండియా(ఏపీఐ) జాతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ జి.నరసింహులు అన్నారు.జిల్లా కేంద్రంలోని బాలజీ బ్యాంకెట్ హాల్లో ఆదివారం ఏపీఐ తెలంగాణ చాప్టర్,ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ దామెర రాములు ఆధ్వర్యంలో ఫిజీషియన( ఎండీ జనరల్ మెడిసిన్ స్పెషలిస్టుల)రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నరసింహులు పాత్రికేయులతో మాట్లాడారు.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొదటిసారిగా ఈ సభ నిర్మల్ లో నిర్వహించడం హర్షనీయమన్నారు.ఆన్ లైన్ పై ఆధార పడి,సొంత వైద్యం చేసుకోవడం ప్రాణాలకే ముప్పు అని హెచ్చరించారు.వైద్య విద్యను అభ్యసించి,అనుభవంతో కూడిన చికిత్స అందించే వైద్యుల ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందన్నారు.కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ రాజారావు,రాష్ట్ర బాధ్యులు ప్రొఫెసర్ నావల్ చంద్ర,ప్రొఫెసర్ చందర్,ప్రొఫెసర్ రమేష్,ప్రొఫెసర్ పవన్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## ప్రవేశ పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన అడిషనల్ కలెక్టర్,డిఇఒ



ప్రజాపక్షం/కుంటాల : నిర్మల్ జిల్లా కుంటాల మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన 6వ తరగతి,ప్రవేశ పరీక్షా కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)బి.వెంకటేశ్వర్లు,ఐఏఎస్,జిల్లా విద్యాశాఖాధికారి ధర్మనం భోజన్న సందర్శించారు.ఈ సందర్భంగా వారు పరీక్ష జరుగుతున్న తీరును నిశితంగా పరిశీలించి,పరీక్షా గదుల్లోని విద్యార్థులతో ముచ్చటించారు.విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా ప్రశాంత చిత్తంతో పరీక్ష రాసి మంచి ఫలితాలు సాధించాలని వారిని అభినందించారు.అనంతరం పరీక్షా కేంద్రం వెలుపల వేచి ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులతో వారు మాట్లాడారు.ఆదర్శ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న నాణ్యమైన విద్యా సౌకర్యాలను పిల్లలు అందిపుచ్చుకోవాలని సూచించారు.ప్రవేశ పరీక్షా ప్రక్రియ అత్యంత పారదర్శకంగా,నిబంధనల ప్రకారం జరుగుతోందని వారు సంతృప్తి వ్యక్తం చేశారు.వీరి వెంట ఈ కార్యక్రమంలో పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఎత్రజ్ రాజు,మండల విద్యాశాఖాధికారి ముత్యం ఇతర విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## డిసిసి చైర్మన్‌కు ఆహ్వాన పత్రిక అందజేత

ప్రజాపక్షం/నిజాంసాగర్: నిజాంసాగర్ (బంజేపల్లి) గ్రామంలో హైందవ ధర్మం, దేశ సంరక్షణ కొరకు ఈనెల 22వ తేదీనా బుధవారం, బంజేపల్లి గ్రామంలోని పోచమ్మ మందిరం వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కులం, వృత్తి, పార్టీలకు అతీతంగా హిందూ బంధువులందరూ భాగస్వామ్యాన్ని కోరుకుంటూ హిందూ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రధానవక్త పాపయ్యగారి గోవర్దన్ తెలిపారు. హిందు బంధువులందరూ సకుటుంబ సమేతంగా హిందూ సమ్మేళనంలో పాల్గొని హిందువుల శక్తిని చాటిచెప్పాలని కోరుతూ పిట్లం మిందూ సమ్మేళన సమితి సభ్యులు ఆహ్వాన పత్రికను కామారెడ్డి జిల్లా డీసీసీ చైర్మెన్ ఏలే మల్లిఖార్జున్‌కు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంబిక శివ యోగి మహారాజ్ దుద్యాల గారి ప్రసంగం ఉంటుందని పేర్కొన్నారు. దాచ గంగారాజు అధ్యక్షులు, మంగళి ఎల్లయ్య ప్రధాన కార్యదర్శి, కోశాధికారి గుంటి దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

## హైందవ శక్తిని చాటి చెప్పాలి

ప్రజాపక్షం/నిజాంసాగర్: ప్రతీ హిందువు ముందుకు వచ్చి హైందవ శక్తిని ప్రపంచానికి ఛాటి చెప్పాలని ఇందూర్ విభాగ్ కళాశాల విద్యార్థి ప్రముఖ్, ప్రధాన వక్తి ఉల్లెంగ ముత్యం అన్నారు. ఆదివారం మహ్మద్‌నగర్ ఉప మండలంలో హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అథితులుగా లింగేశ్వర ఆశ్రమం మల్లారం బాలయోగి పిట్ల కృష్ణ మహారాజ్ పాల్గొన్నారు. ఉదయం 9 గం.లకు మహ్మద్‌నగర్ సొసైటీ ఫంక్షన్‌హాల్‌లో ప్రారంభమైన ఈ కార్యక్రమం మధ్యాహ్నం 12.30 గం.ల వరకు కొనసాగింది. కులాలు, ప్రాంతాలు, వృత్తులు, పార్టీలు వేరైనా అందరూ కలిసి హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నర్వ, హసన్‌పల్లి, మహ్మద్‌నగర్, గున్కుల్, బూర్గుల్, తుంకిపల్లి, తుంకిపల్లితాండా, కొమలంచ, గాలీపూర్, మగ్దూంపూర్, కొనతాండా, సింగితం, తెల్గాపూర్, షేర్‌ఖాన్‌పల్లి గ్రామాలకు చెందిన వారు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష

ప్రజాపక్షం/నిజాంసాగర్: నిజాంసాగర్ మండలకేంద్రంలో ఆదివారం మోడల్ స్కూల్‌లో 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించినట్లు మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ కార్తీక సంధ్య ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఇందులో భాగంగా 6వ తరగతిలో ప్రవేశానికి 146 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 10 మంది గైర్హాజరు కాగా 136 మంది విద్యార్థులు హాజరయ్యారు. 7వ తరగతిలో మొత్తం 23 మంది దరఖాస్తు చేసుకోగా 17 మంది హాజరై 6 గురు గైర్హాజరయ్యారు. 8వ తరగతిలో ప్రవేశానికి 38 మంది దరఖాస్తు చేసుకోగా 31 మంది హాజరై 7 గురు గైర్హాజరయ్యారు. 9వ తరగతిలో 12 మంది పరీక్షకు దరఖాస్తు చేసుకోగా 12 మంది హాజరయ్యారు. 10వ తరగతిలో 6 గురు దరఖాస్తు చేసుకోగా5 గురు హాజరై ఒక్కరు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ కార్తీక సంధ్య వెళ్ళడించారు.

## అక్షయ తృతీయ.. సందర్భంగా ప్రత్యేక పూజలు

ప్రజాపక్షం/లోకేశ్వరం : లోకేశ్వరం మండలంలోని ఆయా గ్రామాలలో అక్షయ తృతీయ సందర్భంగా రైతులు పంట చేనులో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అలాగే రాజుర గ్రామంలోని స్వాధ్యాయ పరివారం తరుపున అక్షయ తృతీయ పండుగను ప్రత్యేక పూజలు నిర్వహించి భగవంతునికి వేడుకున్నారు.అక్షయ తృతీయ రోజున వ్యవసాయ పనులు ప్రారంభిస్తే శుభ ప్రదమని పాడిపంటలు బాగా పండాలని వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయని అలాగే ఏదైనా కొనుగోలు చేసిన మంచిదేనని తెలిపారు.

## ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు

ప్రజాపక్షం/బోధన్: నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని శక్కర్ నగర్ శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల వార్షికోత్సవంలో భాగంగా విద్యార్థులు చేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆదివారం శిశు మందిర్ పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి నాగయ్య హాజరై మాట్లాడారు. విద్యార్థులు సంస్కృతి సాంప్రదాయాలను అనురించడం హర్షించదగిన విషయమన్నారు. ఇది సరస్వతి శిశు మందిర్ పాఠశాలలతోనే సాధ్యమవుతుందని కొనియాడారు. విద్యార్థులు దేశభక్తి, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు సంస్కృతిక నృత్యాలతో ఆహుతులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయునీలు, కమిటీ సభ్యులు, తల్లి దండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామకమిటీ అధ్యక్షులుగా సుభాష్‌గౌడ్

**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి** : మండల కేంద్రంలో నూతన గ్రామకమిటీ అధ్యక్షులుగా మల్యాల సుభాష్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం శ్రీలక్ష్మీ నర్సింహాస్వామి దేవాలయంలో నూతన గ్రామ కమిటీలో ఉపాధ్యక్షులుగా సింగిరెడ్డి భరత్, క్యాషియర్‌గా పన్నుల రవి, కార్యదర్శిగా పెంట కిషన్, సలహాదారులుగా ఈర్గల్ల మహేష్, కౌడ రాము, సిలివేరి భూమేశ్వర్, పసుపుల రమేష్, బైండ్ల సాయిలును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మల్యాల సుభాష్‌గౌడ్ మాట్లాడుతూ ఏకగ్రీవంగా ఎన్నుకున్న గ్రామకమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతూ గ్రామాభివృద్ధికి తోడ్పాటునందిస్తానని తెలిపారు. గ్రామ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## నాగంపేట్‌లో ఉచిత వైద్యశిబిరం

**ప్రజాపక్షం/ముప్కాల్** : మండలంలోని నాగంపేట్ గ్రామంలో డాక్టర్ నవీన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించినట్లు తెలిపారు. కంటి పరీక్షలు చేసి మందులు అందజేసి క్యాట్రెట్ సమ్య ఉందో వారికి రక్త పరీక్షలు, ఆపరేషన్ ఆస్పత్రిలో ఉచితంగా చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకున్నారన్నారు. సర్పంచ్ దాసరి గంగాధర్, ఉపసర్పంచ్ మదన్, వార్డు సభ్యులు సురేష్, నారాయణ, రవి, సాయిగణేష్, ఆస్పత్రి స్టాఫ్, మునిష్, శారద, యువనేస్తం సోషల్ ర్వీస్ సభ్యులు వినయ్, ప్రశాంత్, నవీన్, సిబ్బంది, పాల్గొన్నారు.

## కొండెక్కిన మిర్చి ధర..

**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో ఆదివారం సంతలో వచ్చిన ఎండుమిర్చి ధర కొండెక్కడంతో వినియోగదారులు కొనలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వినియోగదారులు గత ఆదివారం నుంచి ఏప్రిల్ 19వ తేది వరకు మోర్తాడ్ మార్కెట్ కు వస్తున్న ఎండుమిర్చి ధర కిలో 240రూపాయాల నుంచి 340రూపాయాల వరకు మిర్చి ధర పలుకుతుంది. దీంతో ప్రజలు ఎండుమిర్చి కొనే పరిస్థితిలో లేకపోవడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. కొందరైతే మిర్చి ధర ఎంత పలికిన మిర్చి కొనడం తప్పదని, ప్రతి ఇంట్లో మిర్చి అవసరమేనని మహిళలు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా మార్కెట్లలో ధరలు నియంత్రిస్తే బాగుంటుందని పేర్కొంటున్నారు.

## సుదర్శన్ రెడ్డిని కలిసిన జిజిహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నిజామాబాద్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్‌నాగమోహన్ ఆదివారం మర్యాదపూర్వకంగా బోధన్, ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు పొద్దుటూరు సుదర్శన్ రెడ్డిని కలిశారు.



# నిర్మల్‌లో వైభవంగా అక్షయ తృతీయ మహోత్సవం

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ పట్టణంలోని రాజశ్యామల పీఠంలో అక్షయ తృతీయ మహోత్సవం 4వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి.మహాదేవ్ శక్తి సంస్థాన్ ఆధ్వర్యంలో,శ్రీశ్రీ శివరాజయోగి కృష్ణస్వామీజీ బ్రహ్మత్వంలో నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక వేడుకలకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు.

### లక్ష పారాయణాలతో మారుమేగిన పీఠం.

అక్షయ తృతీయ పర్వదినం సందర్భంగా లోక కల్యాణార్థం నిర్వహించిన మహాప్రాణవిద్య సహిత శ్రీ సూక్ర మహాపారాయణ మహాయజ్ఞం ఈ వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది వేలాది మంది భక్తులు ఒకే చోట చేరి ఏకకాలంలో లక్షకు పైగా శ్రీ సూక్త పారాయణాలు చేయడం విశేషం.మహాలక్ష్మి కటాక్షం,ఐశ్వర్య సిద్ధికై భక్తులు భక్తిశ్రద్ధలతో ఈ పారాయణంలో పాల్గొన్నారు.

### ఆధ్యాత్మిక చైతన్యం-ధ్యాన శిక్షణ..

శ్రీశ్రీ శివరాజయోగి గురువుగారి ప్రత్యక్ష పర్యవేక్షణలో భక్తులకు మహాప్రాణవిద్య ధ్యాన శిక్షణను అందించారు.ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత,ఒత్తిడి నుంచి ఉపశమనం,ఆత్మీక వికాసం ఎలా సాధ్యమవుతుందో



గురువు భక్తులకు వివరించారు.అనంతరం గోమయ దీపాలతో నిర్వహించిన శ్రీ లక్ష్మీ దీప మహాయజ్ఞం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

### భక్తులకు ప్రసాద వితరణ..

ఈ మహోత్సవంలో పాల్గొన్న భక్తులందరికీ శ్రీ యంత్రం లాకెట్,కుబేర కుంకుమ ప్రసాదం,లక్ష్మీ గవ్వలను అందజేశారు.ఈ కార్యక్రమానికి విచ్చేసిన వేలాది మందికి అన్న ప్రసాద వితరణ చేపట్టారు.భవిష్యత్తులో మరిన్ని ఆధ్యాత్మిక,సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా నిర్వహకులు వెల్లడించారు.

## మానసికంగా దృఢంగా ఉంటే ఎలాంటి వ్యాధినైనా అధిగమించవచ్చు

**ప్రజాపక్షం/నిజామాబాద్** : మానసికంగా దృఢంగా ఉండటంతో హిమోఫీలియా వ్యాధినే కాదు ఎలాంటి వ్యాధినైనా అధిగమించవచ్చని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు గంగారాం, డాక్టర్ ఇన్నమూరి రవితేజలు హిమోఫిలియా వ్యాధిగ్రస్తులకు వారి కుటుంబ సభ్యుల్లో మానిసక ధైర్యాన్ని నింపారు. ప్రతి వ్యాధి మాదిరిగానే హీమోఫిలియో కూడా ఒకటని అన్ని వ్యాధులకు జాగ్రత్తలు తీసుకున్నట్లే ఈ వ్యాధి విషయంలో కూడా జాగ్రత్తలు పాటిస్తే జీవితాన్ని ధైర్యంగా ఆస్వాదించవచ్చని సూచించారు. నగరంలోని మారుతినగర్‌లోని సొసైటీ ఫర్‌రూరల్ రీకన్‌స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాలలో ఇమోఫిలియా సొసైటీ నిజామాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో రోచ్ ప్రోడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ముంబాయి సహకారంతో స్నేహ సొసైటీ దివ్యాంగుల పాఠశాలలో ప్రపంచ హిమోఫిలియా దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.



కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వైద్యులు గంగారాం, రవితేజ, రఘు, సంతోష్, జగదీష్, కార్యదర్శి సిద్ధయ్య, అధ్యక్షులు విజయనందరావు పాల్గొని వ్యాధిపై పలు సూచనలు సలహాలు చేశారు. పలు జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన వైద్యులను ఘనంగా సన్మానించామన్నారు.

## పోటు రంగారావుపై పెట్టిన కేసు ఉపసంహరించుకోవాలి

**ప్రజాపక్షం/మోర్తాడ్:** సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్(ప్రజా పంథా) రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావుపై దేశ ద్రోహం, ఉపా చట్టం కింద పెట్టిన కేసు ఉపసంహరించుకోవాలని సిపిఐ(ఎంఎల్), మాస్‌లైన్ (ప్రజాపంథా) నిజామాబాద్ రూరల్, కామారెడ్డి సంయుక్త జిల్లా నాయకులు జి.కిషన్ పేర్కొన్నారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో సిపిఐ(ఎంఎల్), మాస్‌లైన్ (ప్రజాపంథా) నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ. గత 50ఏళ్లుగా ప్రజల కోసం అనేక ప్రజా ఉద్యమాలు చేస్తున్న మా పార్టీ కార్యదర్శిపై దేశ ద్రోహం ఉపా చట్టాలు పెట్టడం సరికాదని వారన్నారు. బిజెపి ప్రభుత్వం ప్రజల కోసం ప్రశ్నించిన వారిపై అక్రమంగా వారి చేతిలో ఉన్న ఎన్ఐఎ, ఈడి, సిబిఐ లతో గొంతు నొక్కాలని చూస్తున్నారని ఆరోపించారు. అడవి ప్రాంతంలో ఆపరేషన్ కాఘర్ పేరుతో ప్రజాల కోసం పని చేస్తున్న మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేస్తున్నారన్నారు. ప్రజల కోసం మాట్లాడి శాంతియుతంగా ఉద్యమాలు చేస్తే వారిపై తప్పుడు కేసులు పెట్టి జైల్లో వేయాలని బిజెపి ప్రభుత్వం పూనుకుందని విమర్శించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్నప్పుడు ఇలాంటి పనులు చేస్తే ఇప్పుడు ఉన్న మోదీ అమిత్‌షా ఎప్పుడో జైలు పాలు అయ్యేవారన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ ప్రశ్నించే హక్కు ఉందన్నారు. దీనిని బిజెపి ప్రభుత్వం వ్యతిరేకంగా వ్యవహరిస్తుందన్నారు. ఇకనైనా ప్రజాస్వామ్యంగా బిజెపి సర్కార్ పనిచేయని పక్షంలో ప్రజలు వారికి బుద్ధి చెబుతారన్నారు. మా పార్టీ కార్యదర్శిపై ఎన్ఐఎ నోటీసులను ఉపసంహరించుకోవాలని, లేనిచో దేశ వ్యాప్తంగా అన్నీ వర్గాలతో ఒకటై ఉద్యమాన్ని చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ మోర్తాడ్ మండల నాయకులు జి.జమున, దశరథ్, దయాల్ సింగ్, గజానంద్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ వెంచర్ల నిర్వహకుల బరితెగింపు

### ప్రభుత్వ హెచ్చరిక బోర్డుల ధ్వంసం

**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామంలో అక్రమ వెంచర్ల వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది. తాజాగా గ్రామ పంచాయతీ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను గుర్తు తెలియని వ్యక్తులు తొలగించి ధ్వంసం చేయడం కలకలం సృష్టించింది.

### అనుమతులు లేవు... అమ్మకాలు జోరు...

జాన్కంపేట్ పరిధిలో డీటీసీపీ నుడా వంటి సంబంధిత శాఖల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే పలువురు నిర్వహకులు వెంచర్లు ఏర్పాటు చేశారు. పంచాయతీ అధికారులు పాతిన బోర్డులు వెంచర్ నిర్వహకులు తమ ప్రతాపం చూపారు. ప్రభుత్వ కార్యాలయానికి చెందిన హెచ్చరిక బోర్డులను ధ్వంసం చేసి పక్క పడేశారు. ఈ చర్యతో గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చట్టం అంటే భయం లేకుండా అధికారులనే సవాల్ చేయడం బాధ్యతారాహిత్యమని మండిపడుతున్నారు.

### పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు...

హెచ్చరిక బోర్డుల ధ్వంసం విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి సందీప్, పాలకవర్గ సభ్యులు వెంటనే స్పందించారు.అక్రమ వెంచర్ల నిర్వహకుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.




## రోడ్డు పక్కన చెట్లకు నిప్పు



**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి** : మండల కేంద్రం నుంచి హసకొత్తూర్ వెళ్లే రహదారి పక్కన ఆదివారం 10 చెట్లకు నిప్పంటుకుంది. రోడ్డు పక్కన చెట్లకు నిప్పు పెట్టడంతో పచ్చదనం నాశనం కావటం, పర్యావరణానికి హానీ కలుగుతోంది. చెట్ల వద్ద ఉన్న మొక్కజొన్న పొట్టుకు నిప్పంటించటంతో ఈ ఘటన జరిగింది. పర్యావరణ పరిరక్షణకు దోహద పడే చెట్ల పెంపకానికి ప్రభుత్వం హరితహారం కార్యక్రమం ప్రవేశపెట్టి అమలు చేస్తోంది. తద్వారా మొక్కలు నాటి పెంచడానికి బోలేడు డబ్బులు ఖర్చు చేస్తూ అధికారులు, ప్రజాప్రతినిధులు నానా తంటాలు పడుతుంటే మరోవైపు పెరిగిన చెట్లను కొందరు నాశనం చేస్తూ ప్రభుత్వ ఆశయానికి గండి పెడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని ఇలాంటి పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు స్థానికులు కోరుతున్నారు.

## కుక్కల స్వైరవిహారం

### రెండు రోజుల్లో పదుల సంఖ్యలో దాడులు

### భయంలో పట్టణ ప్రజలు



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** భీమ్‌గల్ పట్టణంలో వీధికుక్కలు స్వైర్వవిహారం చేస్తున్నాయి. గత రెండు రోజులుగా కుక్కలు గుంపులు గుం పులుగా వీధులపై పడి పదుల సంఖ్యలో ప్రజలపై దాడులు చేస్తుండటంతో పట్టణ వాసులు బెంబేలెత్తిపోతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, ఈ దాడులకు గురవుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

### వరుస దాడులతో వనుకుతున్న పట్టణం

గడిచిన 48 గంటల్లో పట్టణంలోని వివిధ వార్డుల్లో కుక్కలు రెచ్చిపోయా యి. వీధుల్లో ఆడుకుంటున్న చిన్నారులను, నడిచి వెళుతున్న వృద్ధులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నాయి. బాధితుల్లో పలువురికి తీవ్ర గాయాలు కావటంతో వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. మరికొందరు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కుక్కల దాడి ఎప్పుడు ఎటువైపు నుంచి జరుగుతుందో తెలియక ప్రజలు బయటకు రావలంటేనే హడలిపోతున్నారు. వెంటనే కుక్కలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించాలి. సంతాన నియంత్రణ శస్త్రచికిత్సలు యాంటి రేబిస్ వ్యాక్సినేషన్ వేగవంతం చేయాలి. వీధి దీపాలు సరిగ్గా లేని చోట్ల కుక్కల ఆగడాలు ఎక్కువగా ఉన్నందున ఆ సమస్యను పరిష్కరించాలి. ప్రాణాపాయం జ రగక ముందే ఉన్నతాధికారులు స్పందించి భీమ్‌గల్ పట్టణ ప్రజలకు ఈ కుక్కల భయం నుండి విముక్తి ప్రసాదించాలని కోరుతున్నారు.

## వైభవంగా లక్ష్మీ నరసింహస్వామి నవరాత్రి ఉత్సవాలు

### నేటి నుంచి మే 1వ తేది వరకు వేడుకలు

**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల పరిధిలోని జాన్కంపేట్ గ్రామ శివారులో ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నేటి నుంచి మే 1వరకు ఈ ఉత్సవాలు కొనసాగుతాయని ఆలయ కార్యనిర్వహణ అధికారి గింజుపల్లి వేణు ఒక ప్రకటనలో తెలిపారు.

పది రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో ప్రతిరోజు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. ప్రతి రోజు ఉదయం 6.30గంటలకు స్వామి వారికి, అమ్మవారికి విశేష అభిషేక కార్యక్రమాలు జరుగుతాయని, ఉదయం పది గంటలకు లోక కల్యాణార్థం సుదర్శన యాగం నిర్వహించబడుతుందన్నారు. ఈ యజ్ఞ కార్యక్రమాల్లో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరుకునే భక్తులు, మరిన్ని వివరాల కోసం ఆలయ అర్చక బృంధాన్ని సంప్రదించాలని కార్యనిర్వహణ అధికారి సూచించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.